యార్డుకు యోగమెప్పుడో..?

- నిరుపయోగంగా బెల్లంపల్లి మార్కెట్ యార్డు
- ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లోనే పత్తి కొనుగోళ్లు
- రైతులకు ఉపయోగపడని గోదాంలు


బెల్లంపల్లిలో నిర్మించిన గోదాం

బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఉన్నా రైతులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు. కష్ట నష్టాలకోర్చి పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి వీలు లేకుండా ఉంది. పత్తి పంటను ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో విక్రయాలు చేపడుతుండగా మార్కెట్ యార్డులో మరేఇతర పంట ఉత్పత్తులను కొనుగోలు చే యడం లేదు. రైతుల కోసం మార్కెట్ యార్డును ఏర్పాటు చేశామని చెప్పడమే కానీ, తదనుగుణంగా వ్యవహరించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. – బెల్లంపల్లి

7నుంచి పత్తి కొనుగోళ్లు..

మార్కెట్ కమిటీ పరిధిలో పత్తి క్రయ విక్రయాలు కొనసాగుతున్నాయి. రోజువారీగా కనిష్టంగా 2వేల నుంచి గరిష్టంగా 3వేల పైచిలుకు క్వింటాళ్ల వరకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల 7న పత్తి కొనుగోళ్లు ప్రారంభంకాగా ఇప్పటి వరకు 11,090 క్వింటాళ్ల పత్తి క్రయ విక్రయాలు జరిగాయి. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉండగా రైతుల వెతలను తీర్చే తీరిక మార్కెటింగ్ శాఖ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు లేకుండా పోయిందనే విమర్శలు ఉన్నాయి.

కొనుగోళ్లు జరగట్లే...

బెల్లంపల్లిలో ఆధునీకంగా మార్కెట్ యార్డును నిర్మించినప్పటికీ రైతులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు. మార్కెట్ యార్డు ఉన్నమాటే కానీ పంట ఉత్పత్తుల అమ్మకం, కొనుగోళ్లు జరగడం లేదు. పంట విక్రయాలను ఎప్పటిమాదిరిగానే ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో నిర్వహిస్తున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి పండించిన పత్తిని అంతే స్థాయిలో ఇబ్బందులను ఓర్చుకొని తాండూర్ మండలం రేపల్లె వాడ శివారులో ఉన్న ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. ఏళ్ల తరబడి నుంచి ఈ తంతు ఆనవాయితీగా వస్తోంది. ఏటా రవాణా చార్జీలు పెరిగి తడిసిమోపెడవుతున్నాయి. బెల్లంపల్లి కేంద్రంగా జిన్నింగ్ మిల్లులు లేవనే సాకు చూపి, ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రభుత్వ అధికారులు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులను అడ్డాగా మల్చుకున్నారనే విమర్శలు రైతుల నుంచి వస్తున్నాయి.

గోదాంలన్నీ అద్దెకు...

ఉమ్మడి ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న బెల్లంపల్లి సబ్ యార్డు 2012 సంవత్సరంలో వేరుపడి ప్రత్యేక మార్కెట్ కమిటీగా ఏర్పడింది. ఈ మేరకు బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 11,200 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాంలను నిర్మించారు. గోదాంల నిర్మాణం జరిగి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఏ ఒక్కసారి కూడా రైతులకు ఉపయోగపడిన దాఖలాలు లేవు. ప్రైవేట్ పరంగా వ్యాపార, వాణిజ్య వర్గాలు, ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ, వేర్ హౌజింగ్ కార్పొరేషన్ శాఖకు అవసరాలకు అనుగుణంగా గోదాంలను అద్దెకు ఇస్తున్నారు. రైతుబంధు పథకం గురించి రైతాంగానికి అవగాహన కల్పించడంలో చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు. పండించిన పంటకు మద్దతు ధర దక్కే వరకు మార్కెట్ కమిటీ గోదాంలలో పంట ఉత్పత్తులను నిల్వ ఉంచుకునే వెసులు బాటు ఉన్నా ఆ దిశగా రైతాంగాన్ని చైతన్య పర్చడం లేదు. గోదాంలను రైతులు వినియోగించుకునేలా అవగాహన కల్పించడంలో తీవ్ర నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అలంకారప్రాయంగా .....

పంట ఉత్పత్తుల క్రయ విక్రయాల కోసం బెల్లంపల్లి మార్కెట్ యార్డులో సౌకర్యాలు కల్పించారు. ఎలక్ట్రానిక్ కాంటాలు, కంప్యూటర్ రూమ్‌లు ఇతరాత్ర సదుపాయాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొనుగోళ్లు జరగకపోవడంతో ఎలక్ట్రానిక్ కాంటాలు వినియోగంలో లేక అలంకారప్రాయంగా మారాయి. మార్కెట్ యార్డు పరిధిలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఎటు చూసినా చిత్తడి వాతా వరణం కనిపిస్తోంది. మార్కెట్‌యార్డులో పత్తియేతర పంట ఉత్పత్తులు కొనుగోళ్లు చేయడానికి చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఉపయోగపడడం లేదు...

మార్కెట్ యార్డు ఉండీ కూడా ఉపయోగం లేకుండా పోతోంది. యార్డు ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి పంట ఉత్పత్తులు కొనుగోలు చేయలేదు. ప్రభుత్వం పంటలకు మద్దతు ధర ప్రకటించినప్పటికీ, అమ్ముకునే సౌకర్యం కల్పించకపోవడంతో చేసేదేమీ లేక వ్యాపారులు, దళారులకు అమ్ముకుంటున్నాం. యార్డులో కొనుగోళ్లు చేపడితే బాగుంటుంది. అధికారులు రైతుల పక్షాన ఆలోచన చేయాలి.

– చంద్రయ్య, మాలగురిజాల, బెల్లంపల్లి

ఉత్తర్వులు రాలేదు

ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టాం. పత్తి యేతర పంటలను బెల్లంపల్లి మార్కెట్ యార్డులో కొనుగోలు చేయడానికి ఇప్పటి వరకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదు. ముస్ముందు ఉత్తర్వులు జారీ అవుతాయో లేదో కూడా తెలియదు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వ్యవహరిస్తాం.

– భాస్కర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి, బెల్లంపల్లి

క్లుప్తంగా

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన


మాట్లాడుతున్న డివిజన్ అధికారి సర్వేశ్వర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామ సమీపంలోని అర్బన్ పార్కులో డివిజన్ పరిధిలోని మూడు రేంజ్‌ల అధికారులకు సోమవారం అటవీ రక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ అదికారి కె.సర్వేశ్వర్ మాట్లాడారు. గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రిజర్వ్ ఫారెస్టులో చెట్లు నరకకుండా కాపాడాలన్నారు. సమావేశంలో అటవీశాఖ ఫీల్డ్ అధికారులు అప్పలకొండ సదానందం, డిప్యూటీ రేంజ్ అధికారులు ప్రభాకర్, ప్రమోద్‌కుమార్, నందిని, సెక్షన్ అధికారులు అంజయ్య, సతీష్, రాజేశ్ పాల్గొన్నారు.

'వరికొయ్యలు కాల్చొద్దు'

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతులు పంట దిగుబడుల అనంతరం వరికొయ్యలను కాల్చొద్దని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని, నైట్రోజన్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి విష వాయువులు వాతావరణంలోకి వెళతాయని, ఈ ప్రభావం పంటలు, నేలపై పడి భూమి పోషక విలువ తగ్గిపోతుందని తెలిపారు.

'చట్టాలను అతిక్రమించొద్దు'


అవగాహన కల్పిస్తున్న ఏసీపీ ప్రకాశ్

దండేపల్లి: మండలంలోని కొత్తమామిడిపల్లి జీపీ పరిధిలోని దమ్మన్నపేట, మామిడిగూడెం గిరిజన గ్రామాల ప్రజలకు, దమ్మన్నపేటలో దండేపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అటవీ, పోలీస్ చట్టాలపై అవగాహన కల్పించారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ హాజరై మాట్లాడారు. గిరిజనులు పోడు వ్యవసాయం పేరిట అడవులను నరికివేయడం చట్టప్రకారం నేరం అవుతుందని, అలాంటివి చేయకూడదన్నా రు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే పోలీస్ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను అతిక్రమించొద్దని సూచించారు. కార్యక్రమంలో దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ లీకేజీకి మరమ్మతులు


జేసీబీతో మరమ్మతు పనులు చేస్తూ...

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): నెల రోజులుగా మిషన్ భగీరథ మంచినీటి పైప్‌లైన్ లీకేజీతో పొలాల్లోకి నీరు చేరుతుండటంపై ఈ నెల 16వ తేదీన 'సాక్షి' దినపత్రికలో వచ్చిన 'మిషన్ భగీరథ లీకేజీ' కథనానికి అధికారులు స్పందించారు. జేసీ బీతో తవ్వించి సోమవారం లీకేజీని మరమ్మతు చేశారు. దీంతో సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

నేతకాని ఆత్మగౌరవ సభ విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న దుర్గం రాజేష్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఈ నెల 23న శనివారం నేతకాని మహర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే 'నేతకాని ఆత్మగౌరవ సభ' ను విజయవంతం చేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో నేతకాని మహర్ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి సోమవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం చీఫ్ ఆర్గనైజర్ బి.దీపక్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాయమల్లు, ఉపాధ్యక్షుడు కామెర ప్రకాష్, పొలిట్ బ్యూరో సభ్యులు సెగెం రాజేష్, విద్యార్థి యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గూడెంలో భక్తుల పూజలు


సత్యదేవుడిని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో భక్తుల కార్తీక పూజలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకుని పూజలు చేశారు. 314జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

'పాఠశాల ఆరోగ్య విద్య'పై అవగాహన

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్, ఆయుష్మాన్ భారత్‌లలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 19, 20 తేదీల్లో 2రోజుల పాటు పాఠశాల ఆరోగ్య విద్యపై అవగాహన కార్యక్రమాలను జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు, మండల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఆర్‌బిఎస్‌కే వైద్యులు, ఫార్మాసిస్టులకు నిర్వహించే శిక్షణకు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

సరిహద్దులో హెలికాప్టర్ చక్కర్లు

వేమనపల్లి: ప్రాణహిత తీరం వెంట సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు నాలుగుసార్లు హెలికాప్టర్ రేగుంట పోలీస్‌స్టేషన్ వద్దకు వస్తూ, పోతూ చక్కర్లు కొట్టింది. నేటితో మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారానికి తెరపడనుండటంతో హెలికాప్టర్ల రాకతో ఒకింత ఉత్కంఠ నెలకొంది. ముందస్తుగా ఈవీఎం మిషన్‌లను తరలించి పోలీస్‌స్టేషన్‌లో భద్రపర్చారా? లేక ఎన్నికల బందోబస్తు కోసం ప్రత్యేక పోలీసు బలగాలను హెలికాప్టర్ ద్వారా తరలించారా అనేది చర్చనీయాంశంగా మారింది.

సహకార సంఘాలు పరస్పరం సహకరించుకోవాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రామీణస్థాయిలో సహకార సంఘాల సభ్యులకు నాణ్యమైన సేవలందించినప్పుడే వికసిత్ భారత్‌కు పునాది ఏర్పడుతుందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. జిల్లా సహకార శాఖ అధికారి బి.సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక యూనివర్సల్ అర్బన్ సహకార బ్యాంకు సమావేశ మందిరంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా సహకార సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా సహకార మంత్రిత్వ శాఖ ద్వారా 56అంశాల్లో సహకార రంగానికి అత్యంత ప్రాధాన్యం కల్పించినట్లు తెలిపారు. సహకార సంఘాలు పరస్పరం సహకరించుకొని, సమన్వయంగా ప్రగతిపథంలో పయనించాలన్నారు. అనంతరం జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అందించాల్సిన అన్ని రకాల సేవలను అందించుటకు జిల్లా సహకార శాఖ సిద్ధంగా ఉందన్నారు. పెట్రోల్ బంక్‌లు, గోడౌన్, ఖాళీ స్థలాలు అందించుటకు అనుకూలంగా ఉన్నామని, ఈ అవకాశాలను సంఘాలు వినియోగించుకోవాలన్నారు. మహిళా సంఘాలకు సోలార్ పరిశ్రమలు, క్యాంటిన్స్ మొదలగునవి ఏర్పాటు చేయుటకు సిద్ధంగా ఉన్నామన్నారు. విశిష్ట కాకతీయ సహకార శిక్షణ కేంద్రం వరంగల్ ప్రిన్సిపాల్ లూనవత్ యాకుబ్‌నాయక్ మాట్లాడుతూ సహకార వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. అభివృద్ధి సాధించిన సంఘాలకు తెలంగాణ సహకార యూనియన్ హైదరాబాద్ తరుపున మెమెంటో, పథకాలు అందించారు. సమావేశానికి బ్యాంక్ చైర్మన్ వినయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో మూర్తి, సహకార శాఖ అధికారులు రవీందర్ రావు, మల్లారెడ్డి, హన్మంత్‌రెడ్డి, రవి కిషోర్, పీఏసీఎస్ చైర్మన్ సందీప్‌కుమార్, కార్యదర్శులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఇతర సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వరి ధాన్యం కొనుగోళ్లలో చెన్నూర్ ఫస్ట్

చెన్నూర్: ధాన్యం కొనుగోళ్లలో చెన్నూర్ ప్రాథమిక సహకార సంఘం ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలో గతేడాది 2.33లక్షల క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోలు చేసిన చెన్నూర్ సహకార సంఘానికి ఉత్తమ సంఘంగా అవార్డు దక్కింది. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, సహకార సంఘం చైర్మన్ చల్లా రాంరెడ్డి, సంఘం కార్యదర్శి రత్న లక్ష్మీనారాయణ రెడ్డిలకు అవార్డులు అందజేశారు.

పొనకల్ సింగిల్ విండో సొసైటీకి ఉత్తమ అవార్డు

జన్నారం: జిల్లాలో రైతు సేవలో ముందున్న మండలంలోని పొనకల్ సింగిల్ విండో సొసైటీకి ఉత్తమ అవార్డుతోపాటు ప్రశంసా పత్రం దక్కింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీఓ సంజీవరెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం సొసైటీ చైర్మన్ అల్లం రవి, కార్యదర్శి కావటి రాజన్నకు అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

వినతిపత్రం అందజేత

భీమారం: మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువైందని, రోడ్డుపైకి వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారని కోతులను అడవికి పంపించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు సోమవారం పంచాయతీ అధికారి కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు.

రోగుల భోజనం అధ్వానం

- మెనూ పాటించని కాంట్రాక్టర్
- నీళ్ల పప్పుతో సరిపెడుతున్న వైనం
- పట్టించుకోని ఆసుపత్రి సూపరింటెండెంట్


ఆందోళన చేస్తున్న రోగులు

చెన్నూర్: అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన రోగులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భోజన వసతి కల్పిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం వెరసి రోగుల భోజనం అధ్వానంగా మారింది. చెన్నూర్‌లోని 50పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాణ్యమైన భోజనం అందించడం లేదని రోగులు సోమవారం ఆందోళనకు దిగారు. రోగులకు అందించాల్సిన భోజనంలో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. మెనూ ప్రకారం పప్పుతోపాటు కూరగాయలు, గుడ్డుతో భోజనం అందించాల్సి ఉండగా నీళ్ల పప్పు వడ్డించారు. ఆసుపత్రిలో అందించే భోజనం బాగోలేక హోటళ్ల నుంచి తెప్పించుకోవాల్సిన దుస్థితి నెలకొందని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పంచాయతీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని, సమస్యలను పరిష్కరించాలని జిల్లాలోని పంచాయతీ ఉద్యోగులు సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మురళీధర్, శ్రీనివాస్, పంచాయతీ కారోబార్లు, బిల్‌కలెక్టర్లు, పంప్ అపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, మల్టీపర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన


తేమశాతం పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి(డీఆర్‌డీవో) కిషన్ సందర్శించారు. కేంద్రంలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి తేమశాతాన్ని పర్యవేక్షించారు. నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధరతో పాటు సన్నాలకు రూ.500బోనస్ పొందాలని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, మండల వ్యవసాయాధికారి కృష్ణ, ఐకేపీ ఏపీఎం రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

జైపూర్: మండలంలోని మిట్టపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో స్థానిక రైతులు వినతిపత్రం అందజేశారు.

ధాన్యం దళారులకు అమ్మొద్దు

భీమారం: కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దని జిల్లా కాంగ్రెస్ నాయకులు చేకూర్తి సత్యనారాయణరెడ్డి రైతులను కోరారు. ప్రాథమిక సహకారపరపతి సంఘం ద్వారా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు.

క్రీడలు

జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థి సత్తా

తాండూర్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఈనెల 17న జరిగిన ఐదో జాతీయస్థాయి కరాటే పోటీల్లో తాండూర్ మండలం బోయపల్లి గ్రామానికి చెందిన ఎలిగేటి సురేశ్ అనే విద్యార్థి సత్తా చాటాడు. బ్లాక్ బెల్ట్ విభాగంలో పోటీల్లో పాల్గొని ఛాంపియన్ షిప్ సాధించాడు.

నస్పూర్: ఈనెల 17న డ్రంకన్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లోని పటేల్ గార్డెన్‌లో నిర్వహించిన ఐదో నేషనల్ లెవల్ ఓపెన్ టూ ఆల్ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్ షిప్–2024 జాతీయ స్థాయి పోటీలలో నస్పూర్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించారు. పట్టణ పరిధిలోని సాధన గ్రీన్‌కిడ్స్ స్కూల్ విద్యార్థులు వర్షిణి, శివసాయితేజశ్రీ, అమిత్, అన్విత్, ద్వితీయస్థానంలో సంజన్‌కుమార్, ఎండి అయాన్, శివమణి, సాత్విక్, కార్తికేయ, తృతీయస్థానంలో సుశాంక్, అంజన్‌కుమార్, సీహెచ్ భగత్, హనురామ్, శ్రీతిక్, సాయిదీక్షిత్, సాయినిహాల్‌లు నిలిచారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో...

చెన్నూర్: రాష్ట్రస్థాయి పోటీల్లో చెన్నూర్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాల, పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావు తెలిపారు. 15 నుంచి 17 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీల్లో జె. సాత్విక్ బంగారు పతకం, మణికట 80 మీటర్ల హర్డిల్స్ పోటీల్లో వెండి పతకాలు సాధించారని పేర్కొన్నారు.

కోటపల్లి: రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ, కరాటే ఛాంపియన్‌షిప్‌లో కోటపల్లి మండల ఉషోదయ పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరాటే మాస్టర్ తిరుపతి తెలిపారు. కటాస్ విభాగంలో చందన్ వెండి పతకం సాధించగా.. రిత్విక్ కాంస్యం సాధించారు. (బి) గ్రూప్ కటాస్ విభాగంలో ఆయాన్ వెండి పతకం సాధించగా, సందీప్ కాంస్యం పతకం, సీ గ్రూప్ కటాస్ విభాగంలో దిలిప్ కాంస్యం, డి గ్రూప్ కటాస్ విభాగంలో శశికాంత్, కార్తీక్ కాంస్యం సాధించినట్లు మాస్టర్ తిరుపతి తెలిపారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో..

మంచిర్యాలఅర్బన్: ఈనెల 17, 18న సంగారెడ్డి సదాశివపేటలో నిర్వహించిన అండర్–19 తైక్వాండో పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 40 కేజీల విభాగంలో కార్ల శ్రీజ బంగారు పతకం, అండర్ 63 కేజీల విభాగంలో అస్మిత బంగారు పతకం, అండర్ 73 విభాగంలో జగదీష్ కాంస్య పథకం సాధించారు. క్రీడాకారులను డీఈవో అంజయ్య, ఎస్జీఎఫ్ అండర్–19 సెక్రటరీ బాపురావు తదితరులు అభినందించారు.

ప్రమాద బీమా సద్వినియోగం చేసుకోవాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులకు పలు బ్యాంకుల ద్వారా కల్పిస్తున్న ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాంపూర్ డీజీ ఎం (పర్సనల్) అరవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెనరా బ్యాంక్, యూని యన్ బ్యాంక్, ఎస్‌బీఐలలో వేతనాల ఖాతాను తెరువాల్సిందిగా సూచించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు మాత్రం బీమా సౌకర్యం పొందడానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల్లో ఖాతాలు తెరువాలన్నారు.

బ్యాంక్ అకౌంట్ తీసుకోవాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో జీరో అకౌంట్ తీసుకోవాలని ఏరియా ఎస్వోటు జీఎం విజయప్రసాద్ సూచించారు. ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికుడు విధి నిర్వహణలో గానీ, బయట గానీ మృతి చెందితే రూ.20లక్షలు ఇన్సూరెన్స్ చెల్లించేలా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, శాంతిఖని ఏజెంట్ ఖాదీర్‌పాష, హెచ్‌డీఎఫ్‌సీ(మంచిర్యాల) బ్యాంకు మేనేజర్ ప్రభాకర్, ఏరియా అధికారులు, కాంట్రాక్టర్లు ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఏజెంట్‌కు సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును సోమవారం ఏజెంట్ కార్యాలయంలో సీఐటీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు బాలాజీ, నాయకులు వెంగళ శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, సుధాకర్, సాయిలు పాల్గొన్నారు.

ఏజెంట్‌కు వీడ్కోలు

శ్రీరాంపూర్: ఏరియాలో ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్‌గా పనిచేసి ఎస్వోటు జీఎంగా పదోన్నతి పొంది రామగుండంకు బదిలీపై వెళ్తున్న గోపాల్ సింగ్‌ను ఎస్ఆర్పీ 3 గనిపై ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు వేర్వేరుగా సోమవారం ఘనంగా సన్మానించారు.

బీసీ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7గనిలో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గని పై సోమవారం జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ముస్కె సమ్మయ్య, వీరభద్రయ్య, కిషన్ రావు, అశోక్, బద్రి బుచ్చయ్య బరుపటి మారుతి పాల్గొని నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా తాళ్లపల్లి పవన్, కో కన్వీనర్‌గా గుర్రాల మహేందర్‌ను ఎన్నుకున్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

శ్రీరాంపూర్: ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం అధిక ప్రాధాన్యంం ఇస్తుందని శ్రీరాంపూర్ ఏరియా ఎస్వోటు జీఎం సత్యనారాయణ తెలిపారు. నస్పూర్ కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను, ప్రగతి మైదానంలోని వాకింగ్ ట్రాక్ మరమ్మతు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీజీఎంలు అరవిందరావు, ఆనంద్ కుమార్, సివిల్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

మందమర్రిరూరల్: ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా మందమర్రి ఏరియాకు చెందిన కాంపెల్లి సమ్మయ్యను నియమిస్తూ ఆ యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

సంతకాల సేకరణ

మందమర్రిరూరల్: సింగరేణి పరిరక్షణతో పాటు తెలంగాణలోని నూతన బొగ్గు గనులను సింగరేణి సంస్థకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఏరియాలోని కేకే–5 గనితో పాటు ఆయా డిపార్ట్‌మెంట్‌లపై సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. ముఖ్య అతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు దూలం శ్రీనివాస్, రాజేందర్, ముల్కల్ల కనుకయ్య, రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

బహుమతులు ప్రదానం

దండేపల్లి: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో మండల స్థాయిలో గెలుపొందిన వారికి దండేపల్లి జె డ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం బహుమతులు ప్రదానం చేశారు.

సివిల్ సర్వీసెస్‌పై అవగాహన

జన్నారం: మండల కేంద్రంలోని స్లేట్ హై స్కూల్‌లో ప్రముఖ పండితుడు, విద్యావేత్త నారోజు శంకర్ చారి ఆధ్వర్యంలో సోమవారం సివిల్ సర్వీసెస్‌పై అవగాహన కల్పించారు.

పరామర్శ

జన్నారం: ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్ తల్లి ఇటీవల మృతి చెందగా, ట్రస్మా రాష్ట్ర సలహాదారుడు యాదగిరి శేఖర్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.